పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

## 106. ఖురైష్ సూరా పరిచయం

మక్కాలో అవతరించింది. 4 ఆయత్‌లు, ఒక రుకూ ఉన్నాయి. కాబా, దైవగృహం, అందుకే దాన్ని బైతుల్లాహ్ అంటారు. హజ్రత్ ఇబ్రాహీం (అ), హజ్రత్ ఇస్మాయీల్ (అ) దానిని దైవారాధన కోసం నిర్మించారు. అబ్రహారాజు 60 వేల సైన్యంతో కాబాను కూల్చడానికి వస్తున్నప్పుడు అబ్రహా సైనికులు అబ్దుల్ ముత్తలిబ్ ఒంటెల్ని పట్టుకుని తీసుకుపోయారు. అబ్దుల్ ముత్తలిబ్ అబ్రహా దగ్గరకు వెళ్ళి తన ఒంటెలను అడిగాడు. అప్పుడు అబ్రహా అన్నాడు : “నీవు కాబాకు ముతవల్లీవి. నేను కాబాను పడగొట్టాలని వచ్చాను. మీ కాబతుల్లాహ్ గురించి మాట్లాడే బదులు నీ ఒంటెల గురించి అడుగుతున్నావేమిటి?” అందుకు అబ్దుల్ ముత్తలిబ్ (దైవప్రవక్త -స-కు తాత) జవాబిచ్చారు, “నేను ఒంటెల యజమానిని. వాటిని తీసుకుపోవడానికి వచ్చాను. కాబాకు యజమాని అల్లాహ్. దాని విషయం ఆయన చూసుకుంటాడు” అని తన ఒంటెల్ని తీసుకుని తిరిగి వచ్చారు. కాబాపై దాడి జరిగినప్పుడు అల్లాహ్ అబాబీల్ పక్షుల్ని పంపి కాబాను రక్షించాడు.

رُكُوعُهَا 1 ‏ سُورَةُ قُرَيْشٍ مَكِّيَّةٌ 106 ‏ آيَاتُهَا 4

بِسْمِ اللَّهِ الرَّحْمَٰنِ الرَّحِيمِ

لِإِيلَافِ قُرَيْشٍ (1)
إِيلَافِهِمْ رِحْلَةَ الشِّتَاءِ وَالصَّيْفِ (2)
فَلْيَعْبُدُوا رَبَّ هَٰذَا الْبَيْتِ (3) الَّذِي
أَطْعَمَهُم مِّن جُوعٍ وَآمَنَهُم مِّنْ خَوْفٍ (4) ع 1 4 31

### 106. ఖురైష్

**ఆయత్‌లు :** 4 **అవతరణ : మక్కాలో**

పరమ కరుణామయుడు అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో

(1) ఖురైష్‌లకు ఎంతటి ఆసక్తి ఉంది.

(2) శీతాకాలంలో వేసవికాలంలో ప్రయాణం పట్ల ఈ రోజుల్లో వ్యాపారం చేయడం పట్ల (3) కనుక వారు ఈ గృహానికి ప్రభువు (అయిన అల్లాహ్)ను ఆరాధించాలి. (4) ఆయన వారిని ఆకలి నుండి కాపాడి ఉంచాడు. తినిపించాడు. ఇంకా భయం నుండి కాపాడి శాంతిని ప్రసాదించాడు.

1 – 4 వాక్యాలు

ఖురైష్ ప్రజలు వర్తకులు. శీతాకాలంలోనూ, వేసవి కాలంలోనూ వ్యాపారం కోసం యమన్, సిరియా, ఈజిప్టు వగైరా దేశాలకు వెళ్ళి బాగా సంపాదించేవారు. సంపన్న జీవితం గడిపేవారు. అరేబియా అంతటా కాబాకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. అబ్రహా సైన్యం నాశనం అయిన తర్వాత దాని ప్రాముఖ్యత మరింత పెరిగిపోయింది. అరేబియాలోని ప్రజలందరూ మంచివారు, చెడ్డవారు, దొంగలు, దోపిడీగాళ్ళు అందరూ కాబాను గౌరవించేవారు.

ఈ సూరాలో అల్లాహ్ ఖురైష్ తెగ వారితో అంటున్నాడు. మీరు వర్తకం కోసం సిరియా, యమన్, ఈజిప్టు దేశాలకు వెళ్ళి బాగా లాభాలు గడిస్తున్నారు. ఖురైష్ ప్రజలారా! ఇతరుల కన్నా మీకు వర్తకం ద్వారా చక్కని ఉపాధి లభిస్తోంది. ఇది కాబా కారణంగానే. మీరు కాబా సేవకులు అయినందువల్లనే. అందువల్లనే మీ బిడారులను ఎవరూ దోచుకోరు. ఇతరుల విషయం అలా కాదు. కనుక ఖురైష్ ప్రజలారా! అల్లాహ్ గృహంలో అల్లాహ్‌ను ఆరాధించండి. విగ్రహాల ఆరాధన మానుకోండి, న్యాయం కోరేది కూడా ఇదే.